సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం

- పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలి
- మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలి
- పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, సిద్దారెడ్డి



గృహసారథులకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



కదిరి టౌన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

ప్రశాంతి నిలయం: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో వ్యవహరిస్తూ క్షేత్రస్థాయిలో జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. 2024లో తిరిగి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. శుక్రవారం పట్టణంలోని గణేష్ సర్కిల్ వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గృహసారథులు, సచివాలయ సమన్వయకర్తలు జగనన్న సైన్యంలా పని చేయాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వం 2014 ఎన్నికల్లో 600 అబద్ధపు హామీలు ఇచ్చి, నెరవేర్చలేదన్నారు. జన్మభూమి కమిటీలు ప్రతి పనికీ లెక్క గట్టి ప్రజల నుంచి లంచాలు వసూలు చేశారని ధ్వజమెత్తారు. అయితే జగనన్న ప్రభుత్వంలో కులాలు, పార్టీలు, వర్గాలతో సంబంధం లేకుండా అర్హుల గడప వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గృహ సారథులు ప్రతి గడపకూ వెళ్లి టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాల మధ్య ఉన్న వ్యత్యాసాలను వివరించాలన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలన్న జగనన్న లక్ష్యాన్ని నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తుంటాయని, వాటిపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ పార్టీ విధానాలు, పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వం పుట్టపర్తి ప్రాంతానికి ఎనలేని గుర్తింపు ఇస్తూ పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాగా ప్రకటించిందన్నారు. పుట్టపర్తి నగర పంచాయతీని గ్రేడ్–2 మున్సిపాలిటీగా హోదాను పెంచిందన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల మీదుగా ఎన్‌హెచ్–342, గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాలు, నియోజకవర్గంలోని 193 చెరువులను అనుసంధానం చేస్తూ కృష్ణా జలాలతో నింపే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. అనంతరం పుట్టపర్తి నగర పంచాయతీకి గ్రేడ్–2 మున్సిపాలిటీగా ప్రభుత్వం హోదా ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానించారు. అనంతరం కొత్తచెరువు మండల పరిధిలోని మరకుంట పల్లికి చెందిన మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాదవరెడ్డి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మాదవప్ప, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, సచివాలయాల పట్టణ కన్వీనర్ సూర్యనారాయణ గౌడ్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, చెరువు భాస్కర్‌రెడ్డి, లక్ష్మీపతి, పరుశురాంనాయక్, పవన్‌కుమార్, నాయకులు మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

98 శాతం హామీలు నెరవేర్చాం..

కదిరి టౌన్: జగన్‌మోహన్ రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటికే 98 శాతం పూర్తి చేశారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో 27వ సచివాలయం పరిధిలోని గృహ సారథులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, కదిరి నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ చైర్మన్ కొండవీటి నాగభూషణం, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త ఎస్‌ఎండీ ఇస్మాయిల్ తదితరులు మాట్లాడారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ ఆంధ్ర రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారన్నారు. గృహ సారథులుగా మనమంత ప్రజలకు అర్థమయ్యేలా పథకాల లబ్ధిని వివరించాలన్నారు. జగనన్న పాలనపై ప్రజలు సంతృప్తి చెంది ఉంటే వారి భావవ్యక్తీకరణను రికార్డు చేసి మండల జేసీఎస్ గ్రూపుల్లో వేయాలన్నారు. ఈనెల 11వ తేదీ నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి వారి అభిప్రాయాలు సేకరించాలన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. 2024 ఎన్నికల్లో మరింత కష్టపడి పని చేసి, వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలన్నారు. జగనన్న ముఖ్యమంత్రిగా చేసుకోవడం మన లక్ష్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కిన్నెర కళ్యాణ్ కుమార్, ఖాశీం, రాంప్రసాద్, ఆవులస్వామి, మహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొలిమి జిలాన్, ఆవుల వెంకట నారాయణరెడ్డి, పరికి సాధిక్ బాషా, శంకర్, ప్రణీత్ రెడ్డి, మురళి, నాసీర్, వలీ పాల్గొన్నారు.

సన్మానం..

కదిరి టౌన్: ఇచ్చిన హామీ మేరకు కొత్తగా నిర్మించిన కౌన్సిల్ హాల్‌కు మాజీ మంత్రి, మాజీ మున్సిపల్ చైర్మన్ నిజాంవలి పేరు పెట్టడంతో శుక్రవారం ఎమ్మెల్యే సిద్దారెడ్డిని మెప్మా సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సాధిక్, జంషీద్, జిలాన్‌బాషా, శంకర్, అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

ఎన్‌పీకుంట: గోపాలపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన మారెమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి హాజరై అమ్మవారికి పూజలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాము, యూత్ కన్వీనర్ వేణుగోపాల్ యాదవ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, గోవిందు నాయక్, ఈశ్వర్ నాయక్, రామసుబ్బారెడ్డి, గంగిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కదిరి టౌన్: ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల విలువైన చెక్కులను పట్టణానికి చెందిన కలిమున్నీసా, మహబూబ్‌బీకి అందజేశారు.

కదిరి అర్బన్: పట్టణంలోని నానా దర్గా ఉరుసు మహోత్సవాల్లో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి పాల్గొన్నారు. చాదర్ సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పరికి నజిమున్నిసా పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి సీపీఐ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే సిద్దారెడ్డి పరిష్కరించారు. శుక్రవారం సర్పంచ్ శాంతాబాయి ఆధ్వర్యంలో బోరు వేసి పంపు సెట్టు, స్టార్టర్ అమర్చారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణింకఠనాయక్, ఉప సర్పంచ్ గంగిరెడ్డి, వార్డు మెంబర్ రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ తనిఖీ

గాండ్లపెంట: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను కదిరి డీఎస్పీ భవ్యకిషోర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల పురోగతి, సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న డైరీ, విలేజ్ రోస్టర్, కోర్టు కేసుల రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కదిరి రూరల్ సీఐ శివశంకర్‌నాయక్, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి, ఏఎస్ఐ బాలకృష్ణ, హెచ్‌సీ రామయ్య పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి రథోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 16వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిని రథంపై కొలువుదీర్చి ఊరేగించారు.

చేపల పెంపకానికి వేలం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని మల్కాపురం చెరువులో చేపల పెంపకానికి శుక్రవారం సర్పంచ్ నందిని, పంచాయతీ కార్యదర్శి యల్లప్ప, గ్రామ పెద్దలు కేశవరెడ్డి, శంకర్ నారాయణరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. సర్కారు వారి పాటను రూ.38 వేలుగా నిర్ణయించగా.. గ్రామానికి చెందిన శ్రీరాములు రూ.40 వేలకు చెరువును దక్కించుకున్నారు.

7న సర్వసభ్య సమావేశం

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అశోక్ నాయక్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

కుష్టు వ్యాధిపై ర్యాలీ

ముదిగుబ్బ: మండల పరిధిలోని తప్పెటవారిపల్లి గ్రామంలో శుక్రవారం కుష్టు వ్యాధిపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కుష్టు లక్షణాలు, వాటి నివారణ చర్యలు తదితర వాటిపై ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్ రెడ్డి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, ప్రధానోపాధ్యాయుడు బాబా ఫిరోజ్ అహమ్మద్, సీహెచ్ఓ శైలజ, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆవుల అపహరణపై ఫిర్యాదు

కదిరి అర్బన్: మండల పరిధిలోని ముత్యాలచెరువులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఆవులను అపహరించుకెళ్లారని గ్రామస్తులు నరసింహారెడ్డి, జయచంద్రారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

ఏడీసీసీ బ్యాంకు ఆవిర్భావ దినోత్సవం



కదిరిలో సంబరాలు చేసుకుంటున్న సిబ్బంది

పుట్టపర్తి అర్బన్/ధర్మవరం రూరల్/కదిరి అర్బన్/పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి, ధర్మవరం, కదిరిలో శుక్రవారం ఏడీసీసీ బ్యాంకు 105వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయా బ్రాంచ్ కార్యాలయాల్లో సిబ్బంది కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. డైరెక్టర్లను శాలువాలతో సన్మానించారు. రైతుల సేవలో నిరంతరం ఏడీసీసీ బ్యాంక్ పని చేస్తుందని మేనేజర్లు తెలిపారు.

రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం

ధర్మవరం: చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దామని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మట్లాడారు. బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందన్నారు. ప్రత్యేక హోదా సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు, హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ కేటీ శ్రీధర్, ఐఎన్‌టీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అమీర్‌బాషా, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగన అశ్వర్థనారాయణ పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం: అప్పుల బాధతో ఓ చేనేత కార్మికుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ధర్మవరంలో శుక్రవారం జరిగింది. రైల్వే జీఆర్పీ పోలీసులు, మృతుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సిద్దయ్యగుట్టకు చెందిన రామాంజినేయులు, లలితమ్మ దంపతుల రెండో కుమారుడు జింకా హరీష్ (28) కూలి మగ్గం నేసేవాడు. కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చలేక మదనపడేవాడు. గురువారం సాయంత్రం కటింగ్ చేయించుకుని వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. చీకటి పడినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పట్టణంలో గాలించారు. రైలు కిందపడి ఎవరో ఆత్మహత్య చేసుకున్నట్లు సోషల్ మీడియాలో రావడంతో అనుమానం వచ్చి తల్లిదండ్రులు రైల్వే పోలీసుల ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. హరీష్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. రైల్వే జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువగళంతో టీడీపీ భూస్థాపితం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

పుట్టపర్తి టౌన్: యువగళం పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రలో టీడీపీ భూ స్థాపితం కానుందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలో 3వ వార్డు పెద్దబజారు, కోటవీధి, గ్రౌండ్ ఏరియా పరిధిలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ నాయకులతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పడంలో లోకేష్ తండ్రిని మించి పోయారన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ప్రజల ఏమి చేశారో చెప్పి యాత్ర చేస్తే బాగుంటుందన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి యవతను, రుణమాఫీ చేస్తామని రైతులను నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. టీడీపీ నేత చంద్రబాబు పాలనంతా అవినీతి, మోసం, అబద్ధాలతో సాగిందన్నారు. 2014 ఎన్నికల్లో హామీలను గుప్పించి అధికారం చేపట్టిన వెంటనే ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింతున్నారన్నారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. పథకాలు మా జీవితాల్లో వెలుగులు నింపాయంటూ లబ్ధిదారులు ఎమ్మెల్యే ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ నవీన్‌కుమార్, పుడా చైర్‌పర్సన్ లక్ష్మినరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్‌లు తిప్పన్న, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, పట్టణ, మండల కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, సచివాలయాల కన్వీనర్ సూర్యాగౌడ్, కౌన్సిలర్లు సాయిగీత, చెరువుభాస్కర్‌రెడ్డి, సూర్యాగౌడ్, పవన్ కుమార్, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు, సుబ్రహ్మణ్యం, కవిత, నాగరాజు, సాయి, ఈశ్వరప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు వాడితే కఠిన చర్యలు

అమడగూరు: ఏపీని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎస్ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం శీతిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు ముఖ్యంగా గంజాయి, హాషిష్, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే మరణం దగ్గరకు వస్తున్నట్లే అన్నారు. విద్యార్థి దశలో దురలవాట్లకు బానిసలు కాకుండా బాగా చదువుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ వినియోగిస్తున్నా, సరఫరా జరుగుతున్నా వెంటనే 14500 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయాలన్నారు. విషయాన్ని తెలియజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా 10 నుంచి 20 సంవత్సరాలు జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జమేదారు సుధాకర్, ప్రిన్సిపాల్ ప్రభాకర్, పాల్గొన్నారు.

రూ.94 లక్షలతో అదనపు గదుల నిర్మాణం



భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో నాడు–నేడు రెండో దశ కింద రూ.94 లక్షలతో అదనపు గదుల నిర్మాణానికి శుక్రవారం ఎంపీపీ తాతం జగన్మోహన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. పేద విద్యార్థులు కార్పొరేట్ విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకున్నారన్నారు. మొదటి విడతలో రూ.45 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. రెండో విడతలో 8 అదనపు తరగతి గదులు మంజూరు చేశారన్నారు. పేద విద్యార్థులు సౌకర్యాలను వినియోగించుకుని కష్టపడి చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణానాయక్ పాఠశాల ఎస్ఓ దుర్గా, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్తన్న, రవిరెడ్డి, డీలర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

గాండ్లపెంట: అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేసి గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలని ఎంపీడీఓ అంజినప్ప అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 7 గ్రామ సచివాలయాల పరిధిలోని అన్ని శాఖల ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కదిరి ఆర్డీఓ కార్యాలయ ఉప గణాంకాధికారి శివనాయక్ మాట్లాడుతూ.. విద్య, వైద్యం, కిషోర బాలికలు, గర్భిణులు, బడిమానేసిన పిల్లలు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న గోరుముద్ద తదితర అంశాలపై ఎలా గణాంకాలు సేకరించాలో వివరించారు. దోషాలు లేకుండా ఆయా శాఖల సిబ్బంది పూర్తిస్థాయిలో అంశాలను పరిశీలించి నివేదికలు తయారు చేయాలన్నారు. గతంలో ఇచ్చిన గణాంకాల్లో తప్పులు ఉన్నాయని, వాటిని సరిచేసి గ్రామ సచివాలయాల డిజిటల్ సహాయకులకు అందించాలన్నారు.

కదిరి అర్బన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనపై ఏఎన్ఎంలు, డ్వాక్రా సంఘాల లీడర్లు, అగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుధామణి, ఈఓఆర్డీ అంజనప్ప మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి లక్ష్యాలు పూర్తి చేయాలని చెప్పారు.

తలుపుల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ రామానాయక్ అధ్యక్షతన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రోబోవు రోజులలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఎవరు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి అనే విషయాలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శకుంతల పాల్గొన్నారు.

కనగానపల్లి: గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి, ప్రభుత్వ లక్ష్యాలపై అధికారులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈఓఆర్డీ అనిల్ కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలు దాటిన వలంటీర్ సేవలు

- తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ శైలజ

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలో 10వ వార్డు కర్ణాటక నాగేపల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ శైలజ తిరుపతికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసి సేవా భావాన్ని చాటుకుంది.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట



పూజలందుకున్న పెద్దమ్మ అమ్మవారు

తాడిమర్రి: మండలంలోని చిన్నచిగుళ్లరేవు గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ దేవత ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా వేద పండితులు హోమం నిర్వహించి, మహాగణపతి పూజ, పూర్ణాహుతి చేపట్టారు. అలాగే గ్రామం నడిబొడ్డున బొడ్రాయి ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు, యువ నాయకుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

7న కూరగాయల మార్కెట్ గదుల వేలం

ధర్మవరం: పట్టణంలో పాత కూరగాయల మార్కెట్ వద్ద నూతనంగా నిర్మించిన కేతిరెడ్డి సూర్యప్రతాప్ రెడ్డి కాయగూరల మార్కెట్ గదులకు ఈనెల 7వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు కమిషనర్ మల్లికార్జున తెలిపారు. పట్టణంలోని పలు సర్కిళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. మొదటి అంతస్తులోని 51 షాపు రూములు అద్దెలో 40 శాతం డిస్కౌంట్‌తో ఇస్తున్నామన్నారు. మొదటి అంతస్తు బ్లాక్–1 నుంచి బ్లాక్–6 వరకూ సౌత్, వెస్ట్, ఈస్ట్, నార్త్‌లలో బ్లాక్ వన్‌కు గుడ్ విల్ సొమ్ము రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకూ, బ్లాక్–2లో గుడ్‌విల్ రూ.8.70 లక్షల నుంచి రూ.8.90 లక్షలు, బ్లాక్–4లో గుడ్‌విల్ రూ.8.80 లక్షల నుంచి రూ.9 లక్షలు, బ్లాక్–5లో గుడ్‌విల్ రూ.5 లక్షల నుంచి, బ్లాక్–6లో గుడ్‌విల్ రూ.4.2 లక్షల నుంచి రూ.4.40 లక్షల వరకూ ఉంటుందన్నారు. 1.79 ఎకరాల విస్తీర్ణంలో నూతన కూరగాయల మార్కెట్, అండ్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం జరిగిందని వివరించారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.లక్ష సాల్వెంట్స్ సర్టిఫికెట్ కలిగి ఉండి, రూ.లక్ష డీడీ లేదా నగదు రూపంలో డిపాజిట్ ముందుగానే చెల్లించలన్నారు.

పక్కా గృహాలు నిర్మించడమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి

తాడిమర్రి: అర్హత ఉన్న పేదలందరికీ పక్కా గృహాలు నిర్మించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 2వ విడతలో 2,602 ప్రభుత్వ పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. ఇంకా గృహాలు అవసరం ఉన్న వారితో అర్జీలు స్వీకరించాలన్నారు. మరో రెండు నెలల్లో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభిస్తామని వెల్లడించారు. అలాగే గ్రామాల్లో చేపట్టిన జలజీవన్ మిషన్ (జేజేఎం) పనుల్లో భాగంగా ఇంటింటికీ కొళాయి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌శేఖర్‌కు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, వైస్ ఎంపీపీలు యర్రగంగు కృష్ణమనాయుడు, బీసాని లింగమ్మ, ఈఓఆర్డీ కామాక్షి, ఎంఈఓ కృష్ణమోహన్, ఏఓ రమాదేవి, ఏపీఓ సంజీవరెడ్డి, ఏపీఎం సాంబశివుడు, పిఆర్ ఏఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

ఓడీ చెరువు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ)లో రుణాలు తీసుకున్న రైతులు వెంటనే రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని సహకార సంఘం అధ్యక్షుడు ఎద్దుల రామసుబ్బారెడ్డి, సీఈఓ రామ్మోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 15లోపు రెన్యూవల్ చేసుకునే రైతులకు ప్రభుత్వం నుంచి వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి రేగాటిపల్లి రైల్వే గేటు బంద్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రేగాటిపల్లి రైల్వే గేటును మరమ్మతుల కారణంగా మూసివేస్తున్నామని రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ సుదాన్షు కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 5వ తేదీ ఉదయం 6 గంటల వరకూ మూసివేస్తామన్నారు. ప్రజలు సహకరించాలని సూచించారు.

నేడు గృహసారథులకు శిక్షణ

పుట్టపర్తి అర్బన్: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు పుట్టపర్తి రూరల్ మండలానికి చెందిన గృహసారథులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని మండల కన్వీనర్ నరసారెడ్డి పేర్కొన్నారు.

తలుపుల: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గృహసారథులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రఫీ నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కొత్తచెరువు: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో శనివారం అన్ని సచివాలయాల పరిధిలోని గృహసారథులకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సోషల్ యాక్షన్ బృందం సభ్యులకు శిక్షణ

గాండ్లపెంట: స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఆర్డీటీ కదిరి డివిజన్‌లోని 10 మండలాల్లో పని చేస్తున్న 250 మంది సోషల్ యాక్షన్ బృందం సభ్యులకు 4 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీటీ మహిళా సాధికారత విభాగం, ఒడిషా రాష్ట్రానికి చెందిన ట్రైనర్ సురుదేవ్ ఆధ్వర్యంలో బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, బాల్య వివాహాలు, బాలికా విద్యపై స్వచ్ఛంద సంస్థలు, ఆయా శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో జరిగే చిన్న చిన్న సంఘటనలు, సమస్యలు పోలీస్‌స్టేషన్ వరకూ తీసుకు రాకూడదన్నారు. వాటిని గ్రామస్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కదిరి డీఎస్పీ భవ్య కిషోర్, ఎంఈఓ తిరుపాల్‌నాయక్, వైద్యాధికారులు మహేశ్వర మారుతి, బాబా ఫక్రుద్దీన్, సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి, చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు నాయుడు, సంస్థ ధనలక్ష్మి, ఆర్డీ శాంతమ్మ, ఏటీఎల్స్ కృష్ణ, సుకన్య, సుదర్శన్, నరసింగరావు, లక్ష్మన్న పాల్గొన్నారు.

'స్పందన'కు హాజరుకాకపోతే చర్యలు

ఓడీ చెరువు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందన కార్యక్రమానికి సచివాలయ ఉద్యోగులు విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ పోలప్ప ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లో రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకూ స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమయంలో గ్రామ కార్యదర్శులు, విలేజ్ లెవల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సర్వేయర్, మహిళా పోలీసు, ఏఎన్ఎం, డిజిటల్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, సిరికల్చర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్ విధిగా హాజరుకావాలన్నారు. హాజరు కాని వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



